సాక్షి కామారెడ్డి

మంగళవారం ￨ 3 ￨ డిసెంబర్ ￨ 2024



సమస్యల పరిష్కారానికే..

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు.

- 8లో ▸



అందని పశువైద్యం

పశువైద్యాధికారుల కొరతతో పశువులకు వైద్య సేవలు అందడం లేదు. సంచార వైద్య సేవలూ అంతంత మాత్రంగానే ఉన్నాయి.

- 9లో ▸



గరిష్టం/కనిష్టం
33.0 /19.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'సైన్స్‌ఫేర్‌లో భాగస్వాములు కావాలి'



బాన్సువాడ : బాన్సువాడలో ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహించే జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతి పాఠశాల భాగస్వామి కావాలని జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి సూచించారు. సోమవారం బాన్సువాడలో డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌ఫేర్‌లో ప్రతి పాఠశాలనుంచి విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో డీఈవో రాజు, ఎంఈవోలు నాగేశ్వర్‌రావు, దేవిసింగ్, చందర్, వెంకన్న ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల నేతలు కుషాల్, మంద ప్రవీణ్, శ్రీనివాస్, దాసరి రవీందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

14న వాహనాల వేలం

కామారెడ్డి అర్బన్: తనిఖీలలో పట్టుబడిన వాహనాలకు ఈనెల 14న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్టు జిల్లా రవాణా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు రవాణా శాఖ అధికారి కార్యాలయంలో గాని, తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ వెబ్‌సైట్‌నుగాని సంప్రదించాలని సూచించారు.

రేపు బంగ్లాదేశ్‌లోని హిందువులకు మద్దతుగా ర్యాలీ




కామారెడ్డి టౌన్: బంగ్లాదేశ్‌లోని హిందువులకు మద్దతుగా బుధవారం జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో కొంతకాలంగా హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులతోపాటు ఇస్కాన్ ప్రతినిధి చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టును ఖండిస్తూ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు కామారెడ్డిలోని గాంధీ గంజ్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, పట్టణంలోని ప్రధాన వీధులమీదుగా సాగుతుందని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల హిందువులు తరలివచ్చి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు గందె శ్రీనివాస్, ఐక్యవేదిక ప్రతినిధులు పవన్ కుమార్ శర్మ, శ్రీకాంత్, భరత్, శ్రీనివాస్, రవీందర్, ప్రవీణ్, లింగారావు, రాజు, సాయి పాల్గొన్నారు.

మైత్రి క్లినిక్ ప్రారంభం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ట్రాన్స్‌జెండర్ల కోసం మైత్రీ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. దీనిని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి చందర్‌నాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫరీద, కౌన్సిలర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్టీసీ ఆర్‌ఎం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎంగా జోత్స్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె సంగారెడ్డి నుంచి పదోన్నతిపై వచ్చారు. జోత్స్నకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఎం) శంకర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఓ) ఎస్ సరస్వతి ఉన్నారు. కార్యాలయంలో ఆర్‌ఎం పరిధిలోని డిపో మేనేజర్లు ఆర్‌ఎం జోత్స్నను సన్మానించారు.

ఎల్లారెడ్డి సర్కిల్ కార్యాలయంలో రిపోర్ట్ చేసిన నూతన కానిస్టేబుళ్లు



పోలీసు శాఖకు కొత్త బలగం!

- జిల్లాకు 199 మంది నూతన కానిస్టేబుళ్ల కేటాయింపు
- ఇందులో 59 మంది మహిళలు..
- ఠాణాల్లో విధుల్లో చేరిన కొత్తతరం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం గతేడాది కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టింది. ఎంపికైన వారికి ఈ ఏడాది ఫిబ్రవరిలో శిక్షణ ప్రారంభించారు. గతనెలలో వీరి శిక్షణ పూర్తయ్యింది. శిక్షణ పూర్తి చేసుకున్నవారిలో 199 మందిని జిల్లాకు కేటాయించారు. సివిల్ విభాగంలో 124 మంది కానిస్టేబుళ్లు రాగా అందులో 43 మంది మహిళలు ఉన్నారు. ఏఆర్ విభాగంలో 75 మందిని కేటాయించగా వారిలో 16 మంది మహిళలు ఉన్నారు. వారంతా తమకు కేటాయించిన ఠాణాలకు వెళ్లి విధుల్లో చేరారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఎక్కువ మంది కానిస్టేబుళ్లు రిక్రూటయి జిల్లాకు రావడం గమనార్హం.

పెరిగిన మహిళల ప్రాతినిధ్యం..

జిల్లా పోలీసు శాఖలో మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఎస్పీగా ఐపీఎస్‌అధికారి సింధు శర్మ ఉన్నారు. మహిళా ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు పది మంది వరకు ఉన్నారు. అలాగే కానిస్టేబుళ్లుగా నలభై మందికి పైగా ఉన్నారు. తాజాగా 59 మంది వచ్చారు. దీంతో మహిళా పోలీసుల సంఖ్య రెట్టింపయ్యింది. ఏఆర్ విభాగంలో చేరిన వారంతా సెంట్రీ డ్యూటీతో పాటు పెట్రోలింగ్ డ్యూటీలకు కూడా వెళ్లాల్సి ఉంటుంది. అందులోనూ మహిళల ప్రాతినిధ్యం పెరగడం గమనార్హం.

జిల్లాకు వచ్చిన నూతన కానిస్టేబుళ్ల వివరాలు..

విభాగం	సివిల్	ఏఆర్
పురుషులు	81	59
మహిళలు	43	16

తీరిన కొరత

జిల్లాలో 23 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఆయా ఠాణాల్లో 381మంది సివిల్ కానిస్టేబుళ్లు, 177 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. కొత్తగా చేరిన వారితో కలిపి సివిల్ కానిస్టేబుళ్ల సంఖ్య 505కు, ఏఆర్ కానిస్టేబుళ్ల సంఖ్య 252 కు పెరిగింది. జిల్లాకు ఏకకాలంలో 199 మంది పోలీసు కానిస్టేబుళ్లను కేటాయించడంతో పోలీసు శాఖ బలగం పెరిగింది. సివిల్ కానిస్టేబుళ్లు ఎక్కువ మంది రావడంతో జిల్లాలోని పోలీసు స్టేషన్లలో ఉన్న కొరత చాలా వరకు తీరినట్టయ్యింది. కొత్తగా ఎంపికైన ఏఆర్ కానిస్టేబుళ్లంతా జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్ ద్వారా విధులు నిర్వహించనున్నారు. పోలీసు శాఖలో ఎస్సైలు, సీఐలు, డీఎస్పీలకు కొరత లేదు. కానీ కానిస్టేబుళ్ల కొరత ఎక్కువగా ఉండేది. దీనికి తోడు ఇటీవల కొందరు పోలీసు కానిస్టేబుళ్లు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ప్రమోషన్లతో కొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. శిక్షణ పూర్తి చేసుకున్న కొత్త కానిస్టేబుళ్లు రావడంతో కొరత కొంత తీరినట్లేనని భావిస్తున్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల

కామారెడ్డి టౌన్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ జిల్లా కార్యాలయంలో చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఏడాది గడిచినా పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ, రైతు కూలీలకు రూ. 12 వేలు, కౌలు రైతులకు రూ. 15 వేలు, సబ్సిడీపై విత్తనాలు తదితర వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మహిళలకు ప్రతినెలా రూ. 2,500 ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వడం లేదన్నారు. కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఎటు పోయిందో రేవంత్‌రెడ్డి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్టీ నాయకులు మురళీధర్‌గౌడ్, బాణాల లక్ష్మారెడ్డి, నీలం చిన్న రాజులు, పైలా కృష్ణారెడ్డి, రంజిత్ మోహన్, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, కౌన్సిలర్లు శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చార్జిషీట్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార, ఎమ్మెల్యే కేవీఆర్

నేడు శివం కమిటీ సమావేశం

నిజాంసాగర్: రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలతో పాటు జిల్లాలోని నిజాంసాగర్, పోచారం, కౌలాస్ ప్రాజెక్టులనుంచి ఆయకట్టుకు నీటి విడుదల కోసం సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో శివం కమిటీ సమావేశం జరగనుంది. ప్రాజెక్టుల్లో నీటి లభ్యతననుసరించి ఆయకట్టుకు నీటి విడుదల వివరాలను ఖరారు చేయనున్నారు.

నిజాంసాగర్ ఆయకట్టు..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు కింద యాసంగి సీజన్‌లో 1.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ప్రాజెక్టు దాదాపు నిండు కుండలా ఉండడంతో ఆయకట్టుకు 7 విడతల్లో 12 టీఎంసీల నీటిని విడుదల చేయాలని నీటిపారుదలశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనల మేరకు శివం కమిటీ నిర్ణయం తీసుకోనుంది. ఈ కమిటీ నిర్ణయం మేరకు ఈ నెలలోనే డీఐబీ సమావేశం నిర్వహించి షెడ్యూల్‌ను ఖరారు చేసే అవకాశాలున్నాయి.

'సెస్ వసూలు చేయాలి'

కామారెడ్డి క్రైం: భవన నిర్మాణ కార్మికుల చట్టం ప్రకారం ఏవైనా నిర్మాణాలు జరుగుతున్నప్పుడు వాటి వ్యయంలో ఒక శాతం మొత్తాన్ని సెస్‌గా వసూలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో కార్మిక చట్టం సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసూలు చేసిన సెస్ మొత్తాన్ని కార్మికుల సంక్షేమ బోర్డులో జమ చేయాలన్నారు. ప్రతి భవన నిర్మాణ కార్మికుడు కార్మిక శాఖలో రూ. 110 చెల్లించి తన పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. సెస్‌గా వసూలు చేసిన మొత్తాన్ని కార్మికుల సంక్షేమానికి వినియోగిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

పోస్టర్ల ఆవిష్కరణ

పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ శాఖలు రూపొందించిన 'ఒక సంవత్సరం.. ఎన్నో విజయాలు' పోస్టర్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఏవో తిరుమల ప్రసాద్, వెటర్నరీ అధికారులు పాల్గొన్నారు.

పారామెడికల్ కళాశాల ప్రారంభం

- వర్చువల్ విధానంలో ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో పారామెడికల్ కళాశాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కాంగ్రెస్ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానంలో కామారెడ్డి మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన పారామెడికల్ కళాశాలను ప్రారంభించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ వి.విక్టర్, ఆర్డీవో రంగనాథ్‌రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పారామెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఎల్లారెడ్డిలో 2కే రన్

ఎల్లారెడ్డి : బజరంగ్‌దళ్ దేశవ్యాప్తంగా తలపెట్టిన నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎల్లారెడ్డిలో 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు ప్రారంభించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు పరుగు సాగింది. అనంతరం గాంధీచౌక్ వద్ద పట్టణ ప్రజలు, విద్యార్థులు, నాయకులు మానవహారంగా ఏర్పడి మత్తు పదార్థాల నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల నుంచి ప్రజలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ రవీంద్రనాయక్, ఎస్సై మహేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్, కాంగ్రెస్ నాయకుడు విద్యాసాగర్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు పీకే నరేష్, వినోద్ కుమార్, తులసీదాస్, భరత్, రాహుల్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, డీఎస్పీ శ్రీనివాస్

నాటు కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం

- మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాల కల్పన
- మండలానికో మదర్ యూనిట్ మంజూరు
- రూ. 3 లక్షల వరకు వడ్డీలేని రుణ సాయం
- స్వయం ఉపాధి పొందుతున్న పలువురు మహిళలు

నిజాంసాగర్: నాటు కోళ్ల పెంపకానికి ముందుకు వచ్చిన మహిళా సంఘాల సభ్యులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వడ్డీ లేని రుణాలు అందిస్తూ స్వయం ఉపాధికి అండగా నిలుస్తోంది. ఐకేపీ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో నాటుకోడి పిల్లల పెంపకం(మదర్ యూనిట్)ను ఏర్పాటు చేస్తోంది. మదర్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు రూ. 3 లక్షల వరకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణ సదుపాయం కూడా కల్పిస్తోంది. ఇప్పటివరకు జిల్లాలో నిజాంసాగర్, జుక్కల్, లింగంపేట, కామారెడ్డి, సదాశివనగర్, దోమకొండ, మాచారెడ్డి, భిక్కనూరు, మద్నూర్, గాంధారి, తాడ్వాయి, నాగిరెడ్డిపేట మండలాల్లో మదర్ యూనిట్లు ఏర్పాటయ్యాయి.



మదర్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్న మహిళలు

బాయిలర్ కోళ్లలాగే..

పౌల్ట్రీ ఫారాలలో బాయిలర్ కోళ్లను పెంచుతున్నట్లే నాటు కోళ్ల పెంపకం చేపడుతున్నారు. ఒక్కో ఫారంలో 500 నుంచి 2 వేల వరకు కోడి పిల్లలను పెంచడానికి అవకాశం ఇస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి క్రాస్ బ్రీడ్ నాటు కోడి పిల్లలను తీసుకువచ్చి సభ్యులకు అందిస్తున్నారు. అంతేకాకుండా కోడి పిల్లల పెంపకానికి కావాల్సిన దాణా, ఇతర సామగ్రిని సమకూర్చుతున్నారు. ఆరు వారాలపాటు పెంచిన తర్వాత కోళ్లను విక్రయిస్తున్నారు. అంతేకాకుండా నాటు కోడి గుడ్లతో కోడి పిల్లల ఉత్పత్తి కూడా చేపట్టనున్నారు.

రెండు లక్షల రుణం తీసుకున్నా



మాకు మదర్ యూనిట్ ఏర్పాటు కోసం బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 2 లక్షల వడ్డీ లేని రుణం ఇచ్చారు. షెడ్డును అద్దెకు తీసుకొని 1,500 నాటు కోడి పిల్లలను పెంచుతున్నా. కోడి పిల్లలకు నీరు, దాణా పెడుతున్నా. ఇరవై రోజుల్లో పావుకిలోకుపైగా పెరిగాయి. 45 రోజుల్లో కేజీ వరకు వస్తాయి. ఒక్కో నాటు కోడిని రూ. 500 నుంచి 700 వరకు విక్రయిస్తా.

– జయరాం తులసి, నిర్వాహకురాలు, నిజాంసాగర్

అన్ని మండలాల్లో ఏర్పాటు..

బాయిలర్ కోళ్లకు బదులుగా నాటు కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. ప్రతి మండలంలో నాటు కోళ్ల మదర్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నాం. నాటు కోళ్ల పెంపకం పూర్తయ్యేలోగా నాటు కోడి మాంసం విక్రయ కేంద్రాలనూ ఏర్పాటు చేయిస్తాం.

– సురేందర్, డీఆర్డీవో, కామారెడ్డి



నాటు కోడి పిల్లలకు దాణా వేస్తున్న తులసి

నాలుగో విడతలోనూ నిరాశ!

- అర్హత ఉన్నా అందని రుణమాఫీ..
- రెండు లక్షలలోపు రుణమే ఉన్నా మాఫీ కానీ వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు

మోర్తాడ్(బాల్కొండ)/ఇందల్వాయి: వివిధ కారణాలతో రూ.2 లక్షల లోపు రుణం మాఫీ కాని వారికి శనివారం సీఎం రేవంత్‌రెడ్డి మాఫీ సొమ్మును మహబూబ్‌నగర్ వేదికగా విడుదల చేశారు. అయితే అనేక మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ జమకాకపోవడంతో తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో గతంలో మూడు విడతల్లో 83,061 మంది రైతులకు రూ.626.49 కోట్లను విడుదల చేయగా నాలుగో విడతలో రూ.155.81 కోట్లను 17,551 మంది రైతులకు మంజూరు చేశారు. రుణమాఫీ ఫలాలు అందుకోవాల్సిన రైతుల సంఖ్య 2లక్షల మందికి పైగానే ఉంటుందని అంచనా. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోను అనేక మంది రైతులు రుణమాఫీ ప్రయోజనం పొందలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి ఎదురవుతోంది. జిల్లాలో 39,285 మంది రైతులు రుణమాఫీ కోసం దరఖాస్తులు అందించారు. ఇదిలా ఉండగా దరఖాస్తుల్లో ఒకే కుటుంబం నుంచి ఒకటికి మించి దరఖాస్తులు వచ్చాయని, అలాంటి వారిని కలిపితే రెండు లక్షలకు మించి రుణం ఉన్న కేటగిరిలోకి వారు వెళ్లడంతో దరఖాస్తుల సంఖ్యకి లబ్ధిదారుల సంఖ్యకి తేడా ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు.



ప్రభుత్వం మాట తప్పింది...

రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మాట తప్పింది. గతంలో ఏక కాలంలోనే రూ.2 లక్షల వరకు పంట రుణం మాఫీ అని ప్రకటించి ఇప్పుడు మాట మార్చడం ఎంత వరకు సమంజసం. ప్రభుత్వం రైతులను వంచించడం సరికాదు. వెంటనే రుణ మాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయాలి.

– ఏనుగు రాజేశ్వర్, రైతు, మోర్తాడ్

రైతులు కంగారు పడొద్దు

రూ. రెండు లక్షలలోపు పంట రుణాలు ఉండి ఇంకా రుణమాఫీ కానీ రైతులు కంగారు పడవద్దు. అన్ని రకాల ధ్రువపత్రాలతో వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. వారు దరఖాస్తులు స్వీకరించి వ్యవసాయ శాఖకు నివేదిస్తారు. అర్హులందరికీ రుణ మాఫీ అయ్యేలా వ్యవసాయ శాఖ కృషి చేస్తుంది.

– ప్రదీప్ కుమార్, ఏడీఏ, నిజామాబాద్ రూరల్

క్లుప్తంగా

కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత



లింగంపేట(ఎల్లారెడ్డి): కాలుష్య నియంత్రణ అందరి బాధ్యతగా భావించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు హిమబిందు అన్నారు. సోమవారం ఆమె లింగంపేట మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాలుష్యం పెరగడం వల్ల శ్వాసకోస, క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతాయన్నారు. కాలుష్యాన్ని నివారించి మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలన్నారు.

'మంచి మాత్రమే గుర్తింపునిస్తుంది'



కామారెడ్డి అర్బన్: మనిషి తన జీవితంలో చేసే మంచి మాత్రమే శాశ్వత గుర్తింపు నిస్తుందని 1008వ జైన మత గురువు ఆచార్య పార్శ్వ చంద్రజీ అన్నారు. జాతీయ రహదారి ప్రక్కన అడ్లూర్ ఎల్లారెడ్డి సమీపంలో కామారెడ్డికి చెందిన అమర్‌చంద్ బోరా నిర్మించిన జేపీపీ జైన సేవా కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రజీతో పాటు పదమ్ చంద్రజీ, జైదురంధర్ మునీజీ, కాలష్ మునీజీ, జైపురంధర్‌జీలు భక్తులనుద్దేశించి ప్రవచనాలు చేశారు. అన్ని దానాల్లో కంటే భూదానం గొప్పదని, భూదానంతో పాటు జాతీయ రహదారి వెంట వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసే గురువుల కోసం విశ్రాంతి, సేవా గృహం నిర్మించడం పట్ల అమర్‌చంద్ బోరా–సుశీల బోరా దంపతులను అభినందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జైన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పట్టణ జైన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కమల్‌చంద్, దిలీప్‌చంద్, ప్రదీప్‌కుమార్ జైన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 63 వినతులు

కామారెడ్డి క్రైం: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఫిర్యాదులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి మొత్తం 63 ఫిర్యాదులు వచ్చాయి. ఎక్కువగా రెవెన్యూ, హౌసింగ్, పంచాయితీరాజ్ శాఖలకు చెందిన ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ, లేని పక్షంలో పరిష్కార మార్గాలు చూపాలన్నారు. అనంతరం బాల్య వివాహాల రహిత భారత్ పోస్టర్లను ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్ రెడ్డి, విక్టర్, డీఆర్‌డీవో సురేందర్, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్‌రావు, ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు కేటాయించాలి



భిక్కనూర్ మండల కేంద్రంలో గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పేదలకు కేటాయించాలని ఆర్టీఐ జిల్లా ప్రతినిధి గంగల రవీందర్ కోరారు. ఆయన మాట్లాడుతూ.. పల్లె ప్రకృతివనానికి దగ్గరలో గతంలో 50 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారని తెలిపారు. వాటిని ఇప్పటికీ పేదలకు కేటాయించలేదన్నారు. వెంటనే కేటాయించి పేదలకు న్యాయం చేయాలని ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు.

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇప్పించాలి



జీవో– 81 ప్రకారం 61 ఏళ్లు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ వీఆర్‌ఏలుగా పని చేసిన వారు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. వారసులకు ఉద్యోగాలు వస్తాయనే ఆశతో 16 నెలలుగా ఎదురు చూస్తున్నామని తెలిపారు. జీవో వచ్చింది కాబట్టి ఉద్యోగం తప్పకుండా వస్తుందనే నమ్మకంతో చాలామంది తండ్రి ఉద్యోగం కోసం అన్నదమ్ములకు వాటా కింద ఆస్తులు రాసిచ్చారని పేర్కొన్నారు. మరి కొందరు అప్పులు చేసి తమ సోదరులకు రూ.లక్షలు ముట్టజెప్పుకున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వారసత్వ ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు.

ధరణి సమస్యపై ఫిర్యాదులు

రాజంపేట: స్థానిక తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రాజంపేట, తలమడ్ల, ఆరెపల్లి గ్రామాల నుంచి ధరణి సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు మండల తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. అదే విధంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సామాజిక ఆర్థిక సర్వే త్వరగా ఆన్లైన్లో నమోదు చేయాలని, ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురాం, ఎంఈవో పూర్ణచంద్రరావ్, ఏవో శృతి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

పిట్లంలోనూ..

పిట్లం(జుక్కల్): స్థానిక తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ వేణు గోపాల్ పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్



తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యాక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ రహిమొద్దీన్ అన్నారు. గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వచ్చే సోమవారం రోజు జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఏవో నర్సిములు, ఎంఈవో రామస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణి నిర్వహించని అధికారులు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని అసిస్టెంట్ విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలో ప్రతి సోమవారం విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని నిబంధన ఉంది. అయినా సోమవారం కార్యాలయంలో 11 గంటలు దాటినా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించలేదు. ఏ ఒక్క అధికారి కూడా కార్యాలయంలో లేరు. చాలా మంది అధికారులు సమయపాలన కూడా పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఏడీ అరవింద్‌కు వివరణ కోరగా.. పిట్లం విద్యుత్ శాఖలో ఏడీ, ఏఈ, లైన్ ఇన్స్‌పెక్టర్‌లు ఇన్‌చార్జ్‌లుగా ఉన్నారని, అదే విధంగా పూర్తి స్థాయి సిబ్బంది లేరని పేర్కొన్నారు. అందువల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని సెక్షన్ ఆఫీస్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు.



పిట్లం విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

స్కీం పేరుతో స్కాం

- సామాన్యులకు రూ.4కోట్ల వరకు టోకరా
- ముఖం చాటేసిన స్కీం నిర్వాహకులు
- రెండేళ్లు గడిచినా బహుమతులు లేవు..
- డబ్బులు వాపస్ ఇవ్వడం లేదు
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు



దొన్కల్‌లో స్కీం బాధితులు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం దొన్కల్‌కు చెందిన దేవమ్మ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. తన ఇద్దరు మనవళ్లకు ఎంతో కొంత జమ చేయాలనే ఉద్దేశంతో ఒక స్కీంలో సభ్యురాలిగా చేరి నెలకు రూ.599 చొప్పున 15 నెలల పాటు రూ.8,985 జమ చేసింది. ఇద్దరు మనవళ్ల పేరు మీద ఆమె మొత్తం రూ.17,970 స్కీం నిర్వాహకులకు చెల్లించింది. స్కీం కాల పరిమితి ముగిసినా నిర్వాహకులు దేవమ్మకు బహుమతిని కానీ ఆమె జమ చేసిన డబ్బును కానీ వాపస్ చేయడం లేదు.

ఇదే గ్రామానికి చెందిన స్వరూప స్కీంలో సభ్యురాలిగా చేరి రూ.8,985 జమ చేసింది. ఆమెకు ఎలాంటి బహుమతిని ఇవ్వలేదు. ఇలా దేవమ్మ, స్వరూపకే కాదు వేలాది మందికి స్కీం నిర్వాహకులు ముఖం చాటేశారు. నిజామాబాద్ కేంద్రంగా సాగిన ఈ స్కీంతో అనేక మంది మోసపోయారు. స్కీం కాల పరిమితి ముగిసి రెండేళ్లు గడిచినా సభ్యులకు బహుమతులు ఇవ్వకుండా, వారి డబ్బులు వాపసు చేయకుండా నిర్వాహకులు సతాయిస్తూనే ఉన్నారు.

4వేల మందికి పైగా రూ.4 కోట్ల వరకు నిర్వాహకులకు చెల్లించారు. నామమాత్రంగానే బహుమతులను ఇచ్చి పెద్ద మొత్తంలో నగదును స్కీం నిర్వాహకులు నొక్కివేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కీం నిర్వాహకులలో ఒకరు పోలీసు ఉద్యోగి కొడుకు కావడంతో అతనిపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు బాధితులు జంకుతున్నారని తెలుస్తోంది. గతంలోనూ దొన్కల్ కేంద్రంగా కొందరు రాజకీయ నాయకులు స్కీంను నిర్వహించి పెద్దమొత్తంలో వసూళ్లకు పాల్పడ్డారు. ముందస్తు ఎన్నికలకు ముందు తమ పార్టీకి ఎక్కడ ముప్పు వస్తుందో అనే భయంతో కీలకమైన నాయకులు చొరవ తీసుకోవడంతో స్కీం సభ్యులకు సగంసగం డబ్బులను నిర్వాహకులు వాపస్ చేశారు.

ఇబ్బందుల్లో మధ్యవర్తులు

స్కీంలో సభ్యులను చేర్పించిన వారు ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. సభ్యులను చేర్పిస్తే ప్రతి నెలా కమీషన్ ఇస్తామని నిర్వాహకులు నమ్మించడంతో చాలా మంది సభ్యులను చేర్పించడంతోపాటు వారే సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేశారు. స్కీం బాధితులు ఇప్పుడు తమను సభ్యులుగా చేర్పించిన వారిని పట్టుకున్నారు. దొన్కల్‌కు చెందిన బాధితులు ఇటీవల భీమ్‌గల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేశ్‌కుమార్‌ను ఆశ్రయించగా.. ఆయన ఏజెంట్లుగా వ్యవహరించిన వారిని పిలిపించి స్కీం డబ్బులు వాపసు చేయాలని ఆదేశించారు. రోజువారి విధుల్లో బిజీగా మారడంతో మళ్లీ పోలీసులు దీనిపై దృష్టి సారించలేదు. కమ్మర్‌పల్లి కేంద్రంలో ఓ స్కీం నిర్వాహకులు ఇదే విధంగా ప్రజలను మోసం చేయడంతో బాధితులు తమను సభ్యులు చేర్పించిన వ్యక్తిపై ఒత్తిడి తీసుకువచ్చారు. చివరకు పోలీసులను ఆశ్రయించడంతో ఎస్సై అనిల్‌రెడ్డి చొరవ తీసుకుని కొంత నగదు, కొన్ని టీవీలు, ఫ్రిజ్‌లు ఇప్పించారు. మరి కొంత నగదు, మరికొన్ని వస్తువులు ఇవ్వడానికి స్కీం నిర్వాహకులు గడువు కోరారు.



అపూర్వ సమ్మేళనం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (20001–02బ్యాచ్) సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. మామిడిపల్లిలోని సాయి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించగా, స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

తండ్రీకొడుకుల గంజాయి దందా

- తుని నుంచి ఆటోలో తరలింపు
- మహేశ్వరంలో పట్టుబడిన తొర్లికొండకు చెందిన నిందితులు
- 62 కిలోల గంజాయి, ఆటో, సెల్‌ఫోన్, రూ.10 వేల నగదు సీజ్
- కేసు వివరాలు వెల్లడించిన మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం: ఆంధ్రప్రదేశ్‌లోని తుని నుంచి నిజామాబాద్‌కు ఆటోలో గంజాయి తరలిస్తూ జిల్లాకు చెందిన తండ్రీకొడుకు మహేశ్వరం పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ మౌలానా విశాఖపట్నం జిల్లా చింతపల్లికి చెందిన చిట్టిబాబు నుంచి ఆటోలో గంజాయి తీసుకొచ్చి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన ప్రాణహిత అనే మహిళలకు అధిక ధరకు విక్రయించేవాడు. నవంబర్ 30వ తేదీన సాయంత్రం మౌలానా తన కుమారుడు మహ్మద్ ముస్తాఫాతో కలిసి తుని సమీపంలోని తాళ్లపాలెం వద్ద చిట్టిబాబు నుంచి 62.428 కిలోల(30 ప్యాకెట్లు) గంజాయిని రూ.2.10 లక్షలకు కొనుగోలు చేశాడు. ఆటో వెనుక భాగంలో ప్రత్యేకంగా తయారు చేయించిన ఫ్రేమ్‌లో గంజాయి ప్యాకెట్లు లోడ్ చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. రెగ్యులర్ రూట్‌లో వెళ్తే పోలీసు తనిఖీలుంటాయని మిర్యాలగూడ, దేవరకొండ, కల్వకుర్తి, మహేశ్వరం గేటు నుంచి శ్రీశైలం జాతీయ రహదారి, ఓఆర్ఆర్ మీదుగా నిజామాబాద్ వెళ్లాలనుకున్నారు. ఈ నెల 1వ తేదీన మధ్యాహ్నం 12గంటల సమయంలో కల్వకుర్తి నుంచి మహేశ్వరం గేటు వైపు ఆటోలో గంజాయి తరలిస్తున్న క్రమంలో పోలీసులకు అనుమానం వచ్చి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆటోలో తరలిస్తున్న 62.428 కిలోల గంజాయి(30ప్యాకెట్లు), టాటా ఏస్ ఆటో, మొబైల్ ఫోన్, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకుని మౌలానా, ముస్తాఫాను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. నిందితులను పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పరిస్థితి విషమించి మృతి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని చేపూర్ సమీపంలో 63వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హార్వెస్టర్ డ్రైవర్ గంగారాం సోమవారం మృతి చెందాడు. కరీంనగర్ నుంచి ఆర్మూర్‌వైపు వస్తున్న పాడి లారీ హార్వెస్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో హార్వెస్టర్ డ్రైవర్ గంగారాం, దానిపై ఉన్న విశాల్, జీత్ బసర్‌తోపాటు లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. నలుగురిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి గంగారాం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పెర్కిట్‌లో కొనసాగుతున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా ఏడుగురు పట్టుబడ్డారని, వారి నుంచి రూ.47,700 నగదుతోపాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పీఎంపీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఎల్లారెడ్డి: సరైన పరిజ్ఞానం లేకుండా పీఎంపీ రవీందర్ ప్రజలకు వైద్యం చేస్తున్నాడని పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన కరణం స్వర్ణలత కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు సోమవారం ఫిర్యాదు చేసింది. మోకాళ్ల నొప్పితో బాధపడుతున్న తనకు పీఎంపీ పెయిన్ కిల్లర్లు ఇచ్చాడని, అవి వాడడంతో శరీరమంతా బొబ్బలు ఏర్పడి ప్రాణాపాయ స్థితికి చేరానని తెలిపారు. పీఎంపీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



కామారెడ్డి రూరల్: పట్టణంలోని ముదాంగల్లీలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముదాంగల్లీకి చెందిన లావణ్య ఇంట్లో తనిఖీ చేయగా, 15 క్వింటాళ్ల బియ్యం పట్టుబడిందన్నారు. 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ గ్రామానికి చెందిన మద్దికుంట అక్షిత్, మల్లవ్వ, అజయ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. గ్రామానికి చెందిన జంగిలి గంగాధర్ కూతురు స్నేహను అక్షిత్ ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. పెళ్లి చేసుకోమని అడగ్గా స్నేహకు చెప్పకుండా అక్షిత్ వారం రోజుల క్రితం గల్ఫ్‌కు వెళ్లిపోయాడు. అక్షిత్ పారిపోవడానికి అతడి తల్లి మల్లవ్వ, అన్న అజయ్ సహకరించారని స్నేహ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంబులెన్స్ డ్రైవర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు



ఖలీల్‌వాడి: మద్యం సేవించి అంబులెన్స్ నడిపించిన డ్రైవర్‌ను ట్రాఫిక్ పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తా నుంచి దేవి టాకీస్ చౌరస్తా వరకు సైరన్ ఆన్ చేసి డ్రైవర్ ఇసాక్ అంబులెన్స్‌ను వేగంగా నడిపించాడు. అంబులెన్స్ లో పేషెంట్ లేకున్న వేగంగా వెళ్లడంతో అనుమానం వచ్చి ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్సై సంజీవ్ వెంబడించి పట్టుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

నవీపేట: భార్య కాపురానికి రావడం లేదని మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన మిణుగురు శివ(28) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎత్తొండ గ్రామానికి చెందిన లావణ్యతో ఆరేళ్ల కిందట శివకు వివాహం కాగా, కుటుంబ కలహాల కారణంగా గత ఏడు నెలల క్రితం లావణ్య పుట్టింటికి వెళ్లిందన్నారు. ఆమె తిరిగిరాకపోవడంతో మనస్తాపానికి గురైన శివ ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యానికి బానిసై..

నిజామాబాద్ రూరల్: మద్యానికి బానిసై రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గూపన్‌పల్లికి చెందిన గంగాధర్(32) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. ఇటీవల గంగాధర్ తీవ్రంగా మద్యం సేవించడంతో తల్లిదండ్రులు గంగాధర్‌ను మందలించారు. దీంతో గంగాధర్ గడ్డి మందు సేవించగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సోమవారం మధ్యాహ్నం మృతుడు తన తల్లిదండ్రులతోపాటు భార్యను పొలానికి పంపించి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ప్రమాదవశాత్తు లారీ బోల్తా



బోల్తాపడిన లారీ



బోల్తాపడిన కారు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని గోపాలపేట నుంచి బంజరకు వెళ్లే రోడ్డులో నిర్మాణదశలో ఉన్న కల్వర్టు వద్ద ఆదివారం రాత్రి లారీ బోల్తా పడింది. గుంటూరు నుంచి పత్తిలోడ్‌తో మహారాష్ట్రలోని దులియాకు వెళ్తున్న లారీ (ఏపీ 16 టీజే 5839) ప్రమాదవశాత్తు బోల్తాపడగా, లారీ డ్రైవర్‌తోపాటు క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. నూతన వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్న ప్రాంతంలో సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో లారీ బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డువిస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాలలో సరైన సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చంద్రాయన్‌పల్లి శివారులో కారు..

ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లి గ్రామ శివారులోని 44వ నంబరు జాతీయ రహదారి పైనుంచి ఓ కారు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు ముందు టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు క్షేమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

హైవేపై కారు దగ్ధం



హైవేపై దగ్ధమవుతున్న కారు



ఆర్మూర్‌లో దగ్ధమవుతున్న ఫాగింగ్ యంత్రం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి సమీపంలోని ఎన్‌హెచ్ 161 సర్వీస్ రోడ్డుపై సోమవారం ప్రమాదవశాత్తు కారు దగ్ధమైందని స్థానికులు, ఫైర్ సిబ్బంది తెలిపారు. డోంగ్లీ మండలంలోని మారేపల్లికి చెందిన నలుగురు కారులో సిర్‌పూర్‌కు వెళ్తుండగా, మద్నూర్ సమీపంలోకి రాగానే కారు ఇంజిన్ నుంచి దట్టమైన పొగలు వచ్చాయి. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అప్రమత్తమై కారు నిలిపివేసి అందులోని వారిని కిందికి దింపేయడంతో ప్రమాదం తప్పింది. ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కారులో ప్రయాణిస్తున్న వారు జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ బంధువులు అని తెలిసింది.

ఫాగింగ్‌మిషన్‌కు మంటలు


ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఆరో వార్డు అన్నపూర్ణ కాలనీలో సోమవారం సాయంత్రం మున్సిపాలిటీకి చెందిన ఆటోలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తుండగా మంటలు చెలరేగాయి. ఫాగింగ్ యంత్రానికి మంటలు అంటుకోవడంతో డ్రైవర్ అప్రమత్తమై జనావాసాలకు దూరంగా ఆటోను తీసుకెళ్లి వదిలిపెట్టాడు. అనంతరం మంటలను సిబ్బంది ఆర్పివేశారు.

ప్రభుత్వ పాఠశాలలో మాక్ అసెంబ్లీ



పిట్లం(జుక్కల్): రాంపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం సోషల్ డే సందర్భంగా పాఠశాల సిబ్బంది విద్యార్థులతో కలిసి మాక్ అసెంబ్లీని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ముఖ్యమంత్రిగా, మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, ప్రతిపక్ష నేతలుగా, స్పీకర్‌గా పదవులు చేపట్టి శాసన సభ ఎలా నడుస్తుంది.. వాదనలు, ప్రతిపాదనలు ఎలా ఉంటాయి, సంక్షేమ పథకాలు అమలు, ప్రతిపక్షం పాత్ర మొదలైన అంశాలను కళ్లకు కట్టినట్లు మాక్ అసెంబ్లీను విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నార్య, పాఠశాల సిబ్బంది విఠల్, రాజు, నబీ, సాయిబాబా, బుజ్జయ్య, పోతన, శివనాగేశ్వర రావు, స్వరూప, నీలిమ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీతో ఏఎంసీ చైర్మన్ భేటీ



నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్‌ని సోమవారం పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మహమ్మద్‌నగర్‌లో సబ్ మార్కెట్ యార్డు నిర్మాణంతో పాటు మార్కెట్ అభివృద్ధికి సహకరించాలని షబ్బీర్ అలీని కోరినట్లు చైర్మన్ తెలిపారు.

ఇన్‌చార్జి సీఈవోగా సాయాగౌడ్



నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈవోగా డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీఈవో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో సాయాగౌడ్‌కు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలు చేపట్టిన సాయాగౌడ్‌కు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.